## హార్ముజ్ జలసంధి నుంచి

# సురక్షితంగా బయటకు భారత ఎల్పీజీ ట్యాంకర్లు

### దేశ ఇంధన అవసరాలకు ఊరట

**బలగం టీవి, న్యూఢిల్లీ**

పశ్చిమాసియా యుద్ధ ఉద్రిక్తతల మధ్య ఇరాన్ సరిహద్దులోని హార్ముజ్ జలసంధి నుంచి 'పైన్‌గ్యాస్', 'జగ్ వసంత్' అనే రెండు భారతీయ ఎల్పీజీ ట్యాంకర్లు సురక్షితంగా బయటపడ్డాయి. ఇందుకు సంబంధించిన వీడియోలను ప్రభుత్వ వర్గాలు విడుదల చేశాయి. ఈ నౌకలు దేశవ్యాప్తంగా ఒక రోజు వినియోగానికి సరిపడా సుమారు 92,612 టన్నుల వంటగ్యాస్‌ను మోసుకొస్తున్నాయి. లారక్, ఖేష్మ్ ద్వీపాల మీదుగా ప్రయాణించిన ఈ నౌకల్లో ఒకదానిలో 33 మంది, మరోదానిలో 27 మంది భారత నావికులు ఉన్నారు. ఈ ట్యాంకర్లు మార్చి 26 నుంచి 28 మధ్య భారత తీరానికి చేరుకునే అవకాశం ఉంది. ఇప్పటికే 'శివాలిక్', 'నందా దేవి' వంటి గ్యాస్ నౌకలు సురక్షితంగా భారత్ చేరుకోగా, తాజా నౌకల రాకతో దేశ ఇంధన అవసరాలకు కొంత ఊరట లభించనుంది.

హార్ముజ్ జలసంధి దాటేటప్పుడు టోల్ లేదా సుంకం విధిస్తారనే ప్రచారంపై నౌకా రవాణా మంత్రిత్వ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేష్ సిన్హా స్పందించారు. "ఇది ఒక అంతర్జాతీయ జలసంధి. అంతర్జాతీయ ఒప్పందాల ప్రకారం స్వేచ్ఛా నౌకాయాన హక్కు ఉంటుంది. దీనిపై ఎటువంటి సుంకం విధించరాదు. ఎవరైనా చేసే వాదనలు నిరాధారమైనవే" అని ఆయన స్పష్టం చేశారు.

ప్రస్తుతం ఐదు ఎల్పీజీ ట్యాంకర్లు సరకుతో సిద్ధంగా ఉండగా, ఒక నౌక డ్రైడాక్ నుంచి బయటకు వచ్చిందని తెలిపారు. రాబోయే మూడు నాలుగు రోజుల్లో దానిని కూడా సరుకుతో నింపనున్నట్లు



వెల్లడించారు. మొత్తంగా ఆరు ఎల్పీజీ క్యారియర్లు భారత్‌కు అందుబాటులోకి రానున్నాయి.

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో ఎల్పీజీ కొరత తలెత్తకుండా కేంద్రం చర్యలు చేపడుతోంది. పర్షియన్ గల్ఫ్‌లో నిలిచి ఉన్న మరికొన్ని ట్యాంకర్లను హార్ముజ్ జలసంధి దాటించేందుకు ఇరాన్ అధికారులతో చర్చలు కొనసాగుతున్నాయి. ఈ చర్చలు సఫలం అయితే సుమారు 3 లక్షల టన్నుల ఎల్పీజీ భారత్‌కు చేరుకునే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. తటస్థ దేశాల నౌకలు హార్ముజ్ మీదుగా ప్రయాణించేందుకు అనుమతిస్తామని ఇరాన్ డిఫెన్స్ కౌన్సిల్ ప్రకటించిన నేపథ్యంలో నౌకల రాకపోకల విషయంలో సానుకూలత కనిపిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

# బాలికపై లైంగిక దాడి

- **ఇద్దరు బాలురపై పోక్సో కేసు నమోదు**

**బలగం టీవి, న్యూఢిల్లీ**

భూపాలపల్లి: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాటారం ప్రాంతంలో ఐదేళ్ల చిన్నారిపై లైంగిక దాడి ఘటన వెలుగులోకి రావడంతో స్థానికంగా తీవ్ర కలకలం రేగింది. ఈ నెల 22న ఇంటి వద్ద ఆడుకుంటున్న చిన్నారిని ఇద్దరు బాలురు ప్రలోభపెట్టి సమీపంలోని పార్కుకు తీసుకెళ్లినట్లు సమాచారం. అక్కడ చిన్నారిపై వారు లైంగిక దాడికి పాల్పడినట్లు తెలిసింది. ఘటన అనంతరం చిన్నారి అస్వస్థతకు గురవడంతో తల్లిదండ్రులు గమనించి వెంటనే ఆస్పత్రికి తరలించారు. వైద్య పరీక్షల్లో జరిగిన దారుణం బయటపడటంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. ఇద్దరు మైనర్ బాలురపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు సమాచారం. చిన్నారికి మెరుగైన వైద్యం అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఘటనపై పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు.



# పురుషులకు కూడా ఉచిత బస్సు ప్రయాణం

- **ప్రతి ఇంటికి ఫ్రిజ్.. అన్నాడీఎంకే ఎన్నికల హామీలు వెల్లడి**

**బలగం టీవి, హైదరాబాద్**

చెన్నై: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అన్నాడీఎంకే తన ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసింది. అధికారంలోకి వస్తే పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తామని ప్రకటించింది.

రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి ఉచితంగా ఫ్రిజ్‌లు అందజేస్తామని పార్టీ హామీ ఇచ్చింది. ప్రస్తుతం మహిళలకు అమల్లో ఉన్న ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని పురుషులకు కూడా విస్తరించనున్నట్లు వెల్లడించింది. అదేవిధంగా ఐదు లక్షల మంది మహిళా ఉద్యోగులకు రూ.25 వేల సబ్సిడీతో ద్విచక్ర వాహనాలు అందిస్తామని పేర్కొంది. బ్యాంకుల నుంచి తీసుకున్న విద్యా రుణాలను మాఫీ చేస్తామని, ప్రతి కుటుంబానికి ఏడాదికి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేస్తామని మేనిఫెస్టోలో తెలిపింది. రేషన్ కార్డు ఉన్న వారికి బియ్యంతో పాటు కిలో పప్పు, కిలో మంచినూనె ఉచితంగా అందజేస్తామని హామీ ఇచ్చింది. అదనంగా సంవత్సరానికి ప్రతి కుటుంబానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, సామాజిక భద్రతా పెన్షన్‌ను రూ.2 వేలకు పెంపు, జల్లికట్టు యోధుల కుటుంబాలకు రూ.10 లక్షల ఆర్థిక సాయం వంటి పలు హామీలను కూడా అన్నాడీఎంకే ప్రకటించింది. ఎన్నికల పోరు క్రమంగా వేడెక్కుతున్న నేపథ్యంలో ప్రధాన పార్టీల మేనిఫెస్టోలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారుతున్నాయి.

# క్షయ వ్యాధి నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

- **రాష్ట్ర కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ సంగీత సత్యనారాయణ**
- **గాంధీ మెడికల్ కాలేజీలో ప్రపంచ టీబి దినోత్సవ వేడుకలు**




**బలగం టీవి, హైదరాబాద్**

టీబీ నిర్మూలన మనందరి బాధ్యత అనీ, రాష్ట్రంలో క్షయ వ్యాధి నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎస్.సంగీత సత్యనారాయణ అన్నారు. ప్రపంచ టీబీ దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ గాంధీ వైద్య కళాశాలలోని అల్యూమినీ ఆడిటోరియంలో మంగళవారం '100 రోజుల టీబీ ముక్త్ భారత్ అభియాన్' ప్రచార కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. తొలి విడతలో 17.09 లక్షల మందికి టీబీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించామని తెలిపారు. 4.71 కోట్ల మందికి నిక్షయ్ పోషన్ యోజన పథకం ద్వారా పోషకాహారాన్ని అందించామని చెప్పారు. దేశంలోనే టీబీ నిర్మూలనలో రాష్ట్రంలో అత్యుత్తమ ఫలితాలు సాధించామని తెలిపారు. ప్రజల్లో టీబీ వ్యాధి పట్ల ఉన్న అనుమానాలను తొలగిస్తున్నామనీ, టీబీ లక్షణాలున్న ప్రతి ఒక్కరికీ ఉచితంగా నిర్ధారణ పరీక్షలు, మందులను, వైద్యం అందించి వారిలో మనోధైర్యాన్ని నింపేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అనంతరం తెలంగాణ క్షయ నిర్మూలన విభాగం జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎ.రాజేశం గతేడాది తమ శాఖ ద్వారా జరిగిన ప్రగతి నివేదిక వివరించారు. ఈ సందర్భంగా గతేడాది టీబీ నిర్మూలనలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన 10 జిల్లాల అధికారులను సిబ్బందిని, అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ప్రచార పోస్టర్లను విడుదల చేశారు. పలువురు టీబీ వ్యాధి బాధితులకు పోషకహారం అందజేశారు. వంద రోజుల టీబీ ముక్త్ భారత్ అభియాన్ ప్రచార యాత్రను జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ వైద్య, ఆరోగ్యశాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ ఎం.అనురాధ, ప్రజా ఆరోగ్యం కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ డాక్టర్ రవీందర్ నాయక్, తెలంగాణ టీబీ అసోసియేషన్ వైస్ చైర్మెన్ డాక్టర్ సుధీర్ ప్రసాద్, ఎస్‌టీడీసీ డాక్టర్ రాజేశ్వరి, డబ్ల్యూహెచ్‌ఓ టీబీ కన్సల్టెంట్ డాక్టర్ మహేష్, డాక్టర్ బ్లెస్సి, జేడీ టీబీ ఆఫీసు హెల్త్ ఎక్స్టెన్షన్ అధికారి మొగరాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

# లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేత పాపారావు

- **బీజాపూర్‌లో అనుచరులతో కలిసి సరెండర్**

**బలగం టీవి, హైదరాబాద్**



బీజాపూర్: మావోయిస్టు అగ్రనేత పాపారావు అలియాస్ సున్నం చంద్రయ్య తన అనుచరులతో కలిసి లొంగిపోయారు. బీజాపూర్ ఎస్పీ ఎదుట ఆయన సరెండర్ అయినట్లు పోలీసులు తెలిపారు. ఆయనతో పాటు మొత్తం 17 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో 10 మంది పురుషులు, 7 మంది మహిళలు ఉన్నారు. లొంగిపోయిన వారి వద్ద నుంచి పోలీసులు భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు.

ఇక మరో కీలక నేత సుక్రు కూడా ఒడిశాలో లొంగిపోయినట్లు సమాచారం. ఇటీవల భద్రతా దళాల ఆపరేషన్లు ఉధృతం కావడం, లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వాలు పునరావాసం కల్పిస్తున్న నేపథ్యంలో పలువురు కీలక నేతలు జనజీవన స్రవంతిలో కలుస్తున్నారు. బస్తర్ ప్రాంతానికి చెందిన పాపారావుపై రూ.2 కోట్ల రివార్డు ప్రకటించబడింది. భద్రతా సిబ్బందిపై జరిగిన పలు దాడుల్లో ఆయన కీలక పాత్ర ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. సుక్మా జిల్లా కలెక్టర్ కిడ్నాప్ కేసులోనూ ఆయన ప్రమేయం ఉన్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా, ఒడిశాలో లొంగిపోయిన సుక్రుపై రూ.55 లక్షల రివార్డు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.




# టైం స్కేల్ ఉద్యోగులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలి...

### తెలంగాణ యూనివర్సిటీస్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్...

**బలగం టీవి, హైదరాబాద్**

రాష్ట్రంలోనీ అన్ని యూనివర్సిటీలలో పనిచేస్తున్న టైం స్కేల్ ఉద్యోగులను శాశ్వత ఉద్యోగులుగా పరిగణించాలని, టైం స్కేల్, డైలీ వేజెస్, ఎమ్మెన్నార్, కంటింజెంట్, కాంట్రాక్ట్, ఔర్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించి, దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ యూనివర్సిటీస్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) డిమాండ్ చేసింది. మంగళవారం హైదరాబాద్ ఇందిరా పార్క్ ధర్నాచౌక్ వద్ద యూనియన్ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, టైం స్కేల్ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు హాజరైన యూనియన్ గౌరవ అధ్యక్షులు జై వెంకటేష్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 18 యూనివర్సిటీల్లో సుమారు 10 వేల మంది నాన్ టీచింగ్ సిబ్బంది టైం స్కేల్, డైలీ వేజెస్, ఎన్ఎంఆర్, కంటింజెంట్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానాల్లో దీర్ఘకాలంగా పనిచేస్తున్నారని తెలిపారు. కనీస వేతనాలు, చట్టబద్ధ సౌకర్యాలు లేకపోవడం వల్ల వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. 20, 30 సంవత్సరాలు యూనివర్సిటీకి సేవలందించిన ఉద్యోగులకు రిటైర్ అయిన తర్వాత వట్టి చేతులతో ఇంటికి వెళ్ళవలసి రావడం అత్యంత బాధాకరమన్నారు.సర్వీస్ లో ఉన్నప్పుడు అనారోగ్యానికి గురైతే ఆదుకునే దిక్కే లేదన్నారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, 10 సంవత్సరాలకుపైగా సేవలందించిన వారిని రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. నాన్ టీచింగ్ సిబ్బందికి కనీస వేతనం రూ.26 వేలుగా చెల్లించడంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. అలాగే రూ.10 లక్షల ప్రమాద బీమా, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలన్నారు. అధ్యక్షులు మెట్టు రవి మాట్లాడుతూ ఉద్యోగుల వయోపరిమితిని 61 సంవత్సరాలకు పెంచాలని, పదవీ విరమణ సమయంలో రూ.20 లక్షల గ్రాట్యూటీ చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. సర్వీసులో ఉన్న టైం స్కేల్, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్



ఉద్యోగి ఏ కారణం చేతనైనా మరణిస్తే ఆ కుటుంబ వారసులకు ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగులకు ఆరు నెలల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలన్నారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సందర్భంగా నైనా ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మశ్రీ, కార్యదర్శి దశరథ్, నాయకులు దేవేందర్, అంజయ్య, రవికుమార్, శ్రీనివాస్, మహేందర్, చిరంజీవి, టైం స్కేల్, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.

# నాలాలపై ఆక్రమణలను వెంటనే తొలగించాలి

- **గుంతల్లేని కార్పొరేషనే లక్ష్యంగా పని చేయాలి**
- **ఎంఎంసీ కమిషనర్ టి.వినయ్ క్రిష్ణారెడ్డి**

**బలగం టీవి, హైదరాబాద్**

అనవసరంగా షార్ట్ ఫాల్ రాసి దరఖాస్తులను తిప్పి పంపొద్దనీ, షార్ట్ ఫాల్స్ ఉంటే అన్నీ ఒకేసారి తెలియజేయాలని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.వినయ్ క్రిష్ణారెడ్డి ఆదేశించారు. తార్నాకలోని కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బిల్డ్ నౌ అప్లికేషన్‌లో పెండింగ్‌లో ఉన్న భవన నిర్మాణ అనుమతులను సర్కిల్, జోన్ వారిగా సమీక్షించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పెండింగ్ వివరాలను కూడా అడిగి తెలుసుకున్నారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ చేసే ముందు డీవియేషన్ లేకుండా నిర్ధారణ చేసుకోవాలన్నారు. అన్నీ సక్రమంగా ఉన్న దరఖాస్తులకు వెంటనే అనుమతులు జారీ చేయాలని ఆదేశించారు. సర్కిల్ లెవెల్‌లో ఉన్న టౌన్ ప్లానింగ్ అధికారులందరికీ భవన నిర్మాణ, కూల్చివేతల వ్యర్థాలు పౌరులు ఎక్కడ వేస్తున్నారో తెలుసుకుని, బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాలనీలు, మెయిన్ రోడ్ల మీద ఆక్రమణలు లేకుండా చూడాలని తెలిపారు. నాళాల మీద ఉన్న తాత్కాలిక ఆక్రమణలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. నాళాల మీద ఉన్న ఆక్రమణలను తొలగించడం ద్వారా, నాళాల పూడికతీత సులభం అవుతుందని తెలిపారు. భవన నిర్మాణాల ఫిర్యాదులు అందిన వెంటనే అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కంటెంప్ట్ కేసులకు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో చీఫ్ సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, అడిషనల్ చీఫ్ సిటీ ప్లానర్ రంజిత్ కుమార్, జోనల్ సిటీ ప్లానర్‌లు, అడిషనల్ సిటీ ప్లానర్‌లు, ఇతర టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఎంఎంసీ కమిషనర్ టి.వినయ్ క్రిష్ణారెడ్డి ఇంజినీరింగ్ నిర్వహణ, ఇంజినీరింగ్ ప్రాజెక్టులు, ఇంజినీరింగ్ ఎలక్ట్రికల్ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మొదట ఇంజినీరింగ్ నిర్వహణ విభాగం అధికారులతో మాట్లాడుతూ సీసీ, బీటీ రోడ్లను గుంతల్లేకుండా చేయాలని ఆదేశించారు. గుంతల్లేని కార్పొరేషన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. 99 రోజుల కార్యాచరణ-ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఇంజినీరింగ్ విభాగం పరిధిలో 528 పనులు అనుమతులు పొందాయనీ, అందులో 11 పనులు పూర్తి కాగా, 111 పనులు 50 శాతానికి పైగా పూర్తి అయ్యాయనీ, మిగతా 67 పనులు 25శాతం నుంచి 50శాతం వరకు పూర్తి కాగా, 339 పనులు 25 శాతం కన్నా తక్కువ పూర్తి అయ్యాయని తెలిపారు. ఇంజినీరింగ్ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. వీధి దీపాల మరమ్మత్తులకు అవసరమైన సామాగ్రిని కొనుగోలు చేసి సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. కొత్త వీధి దీపాలను అవసరమైన చోట కొత్తవి, మరమ్మత్తులు ఉంటే చేయాలని ఆదేశించారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించాలని తెలిపారు. ఏవైనా పిర్యాదులు అందిన వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో చీఫ్ ఇంజినీర్ అశోక్‌రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డిప్యూటీ ఇంజినీర్లు పాల్గొన్నారు.

# గుజరాత్ అసెంబ్లీలో యూసీసీ బిల్లు ఆమోదం

**బలగం టీవి, హైదరాబాద్**

గుజరాత్ శాసనసభ ఉమ్మడి పౌరస్మృతి (యూనిఫాం సివిల్ కోడ్ -- యూసీసీ) బిల్లు-2026ను మంగళవారం ఆమోదించింది. దీంతో యూసీసీ బిల్లును ఆమోదించిన దేశంలోని రెండో రాష్ట్రంగా గుజరాత్ నిలిచింది. 2024 ఫిబ్రవరిలో ఉత్తరాఖండ్ ప్రభుత్వం తొలిసారిగా ఈ చట్టాన్ని అమలు చేసింది. గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ అసెంబ్లీలో యూసీసీ బిల్లును ప్రవేశపెట్టగా, చర్చ అనంతరం ఓటింగ్ నిర్వహించి బిల్లును ఆమోదించారు. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిటీ తుది నివేదిక సమర్పించిన వారం రోజుల్లోనే బిల్లును సభ ముందుకు తీసుకురావడం ప్రాధాన్యత సంతరించుకుంది.ఈ బిల్లు అమల్లోకి వస్తే వివాహం, విడాకులు, వారసత్వం, సహజీవన సంబంధాలు వంటి అంశాలపై మతభేదం లేకుండా ఒకే చట్టం అమల్లో ఉంటుంది. బహుభార్యత్వాన్ని నిషేధిస్తూ, వివాహ సమయంలో ఇద్దరికీ జీవించి ఉన్న జీవిత భాగస్వామి లేకపోతేనే ఆ పెళ్లి చట్టబద్ధమని పేర్కొంది.

# ప్రభుత్వాల నిర్బంధ వైఖరిని తిప్పికొట్టాలి

- **ఐక్య ఉద్యమాల ద్వారానే కార్మికుల హక్కులు సాధించుకోవాలి**
- **సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు బాస్కర్**

**బలగం టీవి, హైదరాబాద్**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్బంధ వైఖరిని కార్మిక వర్గం ఐక్య పోరాటాల ద్వారా తిప్పికొట్టాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కార్మిక సంఘాలతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి చుక్క రాములు అధ్యక్షత వహించగా, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాల్రాజ్, టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు కె. సూర్యం, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. శ్రీనివాస్, బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు జి. రాంబాబు ప్రధాన వక్తలుగా పాల్గొన్నారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె. వెంకటేష్ నాయకులందరికీ ఆహ్వానం పలికారు.

ఈ సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ కార్మికుల హక్కుల సాధనకు రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన ఉద్యమాలపై తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ కార్మికోద్యమాలపై ప్రభుత్వం అమలు చేస్తున్న నిర్బంధ చర్యలను తీవ్రంగా ఖండించారు. అంగన్‌వాడీ, గ్రామపంచాయతీ కార్మికులు శాంతియుతంగా ధర్నాలు నిర్వహించేందుకు అనుమతి కోరినా నిరాకరించి అరెస్టులు చేయడం నిరంకుశ వైఖరికి నిదర్శనమన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులపై నిరంతరం నిర్బంధాలు విధిస్తే అదే బాటలో రాష్ట్ర ప్రభుత్వం నడవడం సరికాదని, రాబోయే రోజులలో కార్మికుల హక్కులపై అన్ని కార్మిక సంఘాలు ఐక్యంగా పోరాటం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల సొమ్ము వాళ్ళ హక్కులను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెడుతుంటే రాష్ట్ర ప్రభుత్వం వాటిని అడ్డుకోకుండా అంగన్వాడి, ఆశ వర్కర్ల కోసం శాంతియుతంగా ధర్నాలు నిర్వహిస్తే అడ్డుకోవ డం దుర్మార్గమని ఇప్పటికైనా ఈ వైఖరి విడనాడాలని హెచ్చరించారు. రాష్ట్ర మహిళా నాయకులు పి. జయలక్ష్మి, మంగ, సునీత, కాసు మాధవి, ఎస్వీ, రమలను అర్ధరాత్రి వేళల్లో అరెస్ట్



చేయడం దుర్మార్గమన్నారు. అందరం ఐక్యంగా ఉద్యమించి ప్రభుత్వ నిర్బంధ కాండను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

ఏఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాల్రాజ్ మాట్లాడుతూ వివిధ రంగాల కార్మికుల సమస్యలపై ఐక్య ఉద్యమం చేయాలన్నారు. టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షులు కె. సూర్యం మాట్లాడుతూ కనీస వేతనాలు పెంచకుండా, కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకుండా మోసం చేసిందన్నారు. బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు జి. రాంబాబు మాట్లాడుతూ హామీలు అమలు చేయలేక పోరాడుతున్న కార్మికులపై దాడులు చేయడం అన్యాయమన్నారు. టీయూసీఐ ఎస్ఎల్ పద్మ, ఐఎన్‌టీయూ నాయకులు పి.శివబాబు, ఏఐటీయూసీ నాయకులు కె. యాదగిరి, బీఆర్‌టీయూ మారయ్యతో పాటు సీఐటీయూ అనుబంధ సంఘాల నాయకులు ఆర్. సుదాభాస్కర్, ఎస్వి. రమ, జె. మల్లిఖార్జున్, పి. జయలక్ష్మి, వి.ఎస్. రావు ప్రసంగించారు. సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు వందన సమర్పణ చేశారు. అన్ని కార్మిక సంఘాలు కలిసి ప్రభుత్వ నిర్బంధ విధానాలకు నిరసనగా ఐక్య పోరాటం చేయాలని తీర్మానం చేశారు.

# అమెరికాలో టెక్సాస్ రిఫైనరీలో భారీ పేలుడు

### స్థానికులను సురక్షిత ప్రాంతాలకు తరలింపు

**బలగం టీవి, హైదరాబాద్**

అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రం పోర్ట్ ఆర్థర్ ప్రాంతంలో గల వాలెరో ఆయిల్ రిఫైనరీలో భారీ పేలుడు సంభవించింది. రిఫైనరీలోని ఒక ఇండస్ట్రియల్ హీటర్ పేలడంతో ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు తెలిపారు. స్థానిక కాలమానం ప్రకారం సోమవారం సాయంత్రం సుమారు 6.30 గంటల సమయంలో పేలుడు చోటుచేసుకుంది. పేలుడు సమయంలో భారీ శబ్దం వినిపించిందని, కొన్ని మైళ్ల దూరం వరకు భూమి కంపించినట్లు స్థానికులు వెల్లడించారు.

ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే అధికారులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాద ప్రభావం దృష్ట్యా సమీప ప్రాంతాల ప్రజలను షెల్టర్లకు తరలిస్తున్నట్లు తెలిపారు. అమెరికాలో కీలక చమురు శుద్ధి కేంద్రాల్లో వాలెరో రిఫైనరీ ఒకటి. ఈ కేంద్రంలో రోజుకు సుమారు 3.8 లక్షల బ్యారెళ్ల ముడి చమురును శుద్ధి చేస్తారు. పేలుడు కారణాలు, నష్టం వివరాలపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

# నిరంతర యజ్ఞంలా సీఎం కప్




- తెలంగాణ మట్టిలో మాణిక్యాలను గుర్తిస్తాం
- క్రీడా ప్రతిభను ప్రోత్సహిస్తాం
- రాష్ట్ర స్థాయి ముగింపు వేడుకల్లో క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి

**బలగం టీవి, హైదరాబాద్**

తెలంగాణ మట్టి లోని మాణిక్యాల క్రీడా ప్రతిభను సానపెట్టేందుకే సీఎం కపూర్ పోటీ నిర్వహించామని ఇది ఒక నిరంతర కార్యక్రమంలో గా కొనసాగిస్తామని రాష్ట్ర క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ఎల్బీ ఇండోర్ స్టేడియంలో రెండవ విడత సీఎం కప్ పోటీల ముగింపు ఉత్సవాలు రాష్ట్ర స్థాయి వివరాలు ఛాంపియన్షిప్ టీమ్లకు ప్రోసీల బహుకరణ మంగళవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, రాష్ట్రంలో ఉన్న మట్టిలో మాణిక్యాలను గుర్తించేందుకే రెండు విడతలుగా సీఎం క పోటీలను ఘనంగా నిర్వహిస్తున్నామని ఒక నిరంతర ప్రక్రియ లాగా దీనిని ప్రతి సంవత్సరం కొనసాగిస్తామని తెలిపారు. క్రీడల్లో విజయం సాధించాలంటే కేవలం ప్రభుత్వ ప్రోత్సాహం మాత్రమే క్రీడాకారులకు కృషి పట్టుదల ఉండాలని అప్పుడు మాత్రమే క్రీడాకారులు చాంపియన్లుగా తీర్చిదిద్దబడతారని తెలిపారు.యువ క్రీడాకారులకు సైనా నెహ్వాల్ వంటి క్రీడాకారుల జీవితం స్ఫూర్తి కావాలని ఆయన అన్నారు.క్మీఖఎం క పోటీలో పాల్గొన్న క్రీడాకారుల ప్రతించి వారికి స్పోర్ట్స్ స్కూల్లో అకాడమిలలో అవసరమైతే ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తామని తెలిపారు.స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ క్రీడా ప్రతిభ గుర్తింపు కొరకే సీఎం కప్ పోటీలు నిర్వహిస్తున్నామని, ఇది నిరంతరం జరిగే పక్రియ లాగా ముందుకు వెళ్తామని తెలిపారు. క్మీ-రమశిక్షణ కలిగిన క్రీడాకారులను గుర్తించి వారిని ప్రోత్సహిస్తామని తెలిపారు. క్మీూప్త ప్రభుత్వ క్రీడల సలహాదారులు, ఏపీ జితేందర్ రెడ్డి మాట్లాడుతూ, సీఎం కప్ పోటీల విజయవంతంలో క్రీడా సంఘాల భాగస్వామ్యం ఎంతో ఉందని, ఎన్నో ప్రభుత్వ శాఖలు విభాగాలు సహకారం వల్లనే పోటీలు విజయవంతంగా కొనసాగాయని తెలిపారు. మేనేజింగ్ డైరెక్టర్ సోనీ బాలాదేవి మాట్లాడుతూ, సీఎం క పోటీలలో దాదాపు 5 లక్షల 40 వేల మంది క్రీడాకారులు ఆక్మీ-లనైన్లో నమోదు చేసుకోగా, వారి సంపూర్ణ సమాచారాన్ని క్రీడా అవసరాలకు అనుగుణంగా క్రోడీకరిస్తున్నామని తెలిపారు. వరాల్ ఛాంపియన్ గా అదిలాబాద్ గ్రామీణ మండల అసెంబ్లీ జిల్లా రాష్ట్రస్థాయి ఐదుఅంచల్లో కొనసాగిన ఈ పోటీల్లో అది ఉమ్మడి అదిలాబాద్ జిల్లా జట్టు ఓవరాల్ ఛాంపియన్ గా నిలబడగా, రెండో స్థానంలో రంగారెడ్డి జిల్లా మూడో స్థానంలో కరీంనగర్ జిల్లా నిలిచాయి. విజేతలకు మంత్రి వాకిటి శ్రీహరి స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి సైనా నెహ్వాల్ సోని బాలాదేవిలు ట్రోఫీలు అందజేశారు. సీఎం కప్ పోటీల విజయవంతంకి కృషిచేసిన వివిధ ప్రభుత్వ ప్రైవేటు సంస్థలకు స్పోర్ట్స్ అథారిటీ ఘనంగా సన్మానం చేసి జ్ఞాపికలను బహూకరించింది. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల డివైఎస్ఓ లు, క్రీడా సంఘాల ప్రతినిధులు స్పోర్ట్స్ అథారిటీ కోచులు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



## ఐపీఎల్ 2026కు యష్ దయాల్ దూరం

- 'వ్యక్తిగత పరిస్థితులు' కారణం: ఆర్‌సీబీ డైరెక్టర్ మొ బోబాట్




**బలగం టీవి, బెంగళూరు**

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్‌కు యష్ దయాల్ దూరంగా ఉండనున్నట్లు ఆర్‌సీబీ డైరెక్టర్ ఆఫ్ క్రికెట్ మో బొబెట్ వెల్లడించారు. మంగళవారం నిర్వహించిన ప్రీ--టోర్నమెంట్ మీడియా సమావేశంలో ఆయన ఈ విషయాన్ని ధృవీకరించారు. దయాల్ ప్రస్తుతం వ్యక్తిగత సమస్యలను ఎదుర్కొంటున్నందున జట్టుతో కలవకపోవడం అతనికీ, ఫ్రాంచైజీకీ మంచిదని నిర్ణయించినట్లు బోబాట్ తెలిపారు. అయితే అతను ఇంకా ఆర్‌సీబీతో ఒప్పందంలోనే కొనసాగుతున్నాడని స్పష్టం చేశారు.

**ప్రచార కార్యక్రమాల్లో గైర్హాజరు నేపథ్యంలో ఊహాగానాలు**

కొత్త సీజన్‌కు ముందు జట్టు అధికారిక ప్రచార కార్యక్రమాల్లో దయాల్ కనిపించకపోవడంతో పలు ఊహాగానాలు వినిపించాయి. అతనిపై నమోదైన న్యాయపరమైన కేసుల కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందని వార్తలు వెలువడ్డాయి. గాజియాబాద్‌లో నమోదైన కేసులో అరెస్టు నుంచి అతనికిాశ్రీశ్రీఖుష్టుఖుఃఎఱస్త్రప్త జశీబతీ రక్షణ కల్పించినట్లు సమాచారం. అదే సమయంలో జైపూర్‌లో నమోదైన మరో కేసులో, పోక్సో చట్టం కింద ఉన్న ఆరోపణల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఉపశమనం ఇవ్వడానికి క్ష్మియుఙర్ష్టుఖ ఎఱస్త్రప్త జశీబతీ నిరాకరించినట్లు నివేదికలు పేర్కొన్నాయి. ఈ కేసులు ప్రస్తుతం న్యాయపరమైన విచారణలో ఉన్నాయి.

27 ఏళ్ల దయాల్ ఐపీఎల్ 2024 సీజన్‌కు ముందు రూ.5 కోట్లకు ఆర్‌సీబీలో చేరాడు. గత సీజన్‌లో జట్టు టైటిల్ విజయానికి తోడ్పడుతూ 13 వికెట్లు సాధించాడు. అయితే తాజా పరిణామాల నేపథ్యంలో గత ఏడాది యూపీ టీ20 లీగ్‌లో కూడా అతని పాల్గొనడంపై పరిమితులు విధించినట్లు సమాచారం.

## పవర్ లిఫ్టింగ్‌లో అమలాపురం విద్యార్థుల ప్రతిభ

**బలగం టీవి, అనంతపురం**

ఉమ్మడి తూర్పు- పశ్చిమగోదావరి జిల్లాల సబ్ జూనియర్స్ పవర్ లిఫ్టింగ్ పోటీలలో అమలాపురం మండలం ఇందుపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరచారని పాఠశాల ప్రధానోపాధ్యాయుని లంక రాణి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సబ్ జూనియర్స్ విభాగంలో 9వ తరగతి కి చెందిన సిహెచ్ సత్య గోపాలం బెంజ్ స్కాడ్ 110, బెంచ్ ప్రెస్ 45, డెడ్ లిఫ్ట్ 120 మొత్తం 270 కేజీలు, వి బాలాజీ బెంచ్ స్కాడ్ 70, బెంచ్ ప్రెస్ 30, డెడ్ లిఫ్ట్ 90 మొత్తం 190 కేజీలు బరువు ఎత్తి 3వ స్థానం సాధించారన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో సర్పంచ్ చొల్లంగి శివాలిని, ఎస్ఎంసి చైర్మన్, సభ్యులు, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు విజయం సాధించిన విద్యార్థులను, ఆ విద్యార్థులకు మంచి తర్ఫీదునిచ్చిన పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు వీరమల్లు నరసింహారావు (బుజ్జి) ను అభినందించారు.




## ఐపీఎల్‌కు ముందు ఢిల్లీకి షాక్... డకెట్ అవుట్

- ఎల్లిస్ స్థానంలో స్పెన్సర్ జాన్సన్‌ను తీసుకున్న చెన్నై

**బలగం టీవి, హైదరాబాద్**

మరో నాలుగు రోజుల్లో ఐపీఎల్ సందడికి తెరలేవనుండగా ఢిల్లీ క్యాపిటల్స్‌కు భారీ షాక్ తగిలింది. విధ్వంసక ఓపెనర్ బెన్ డకెట్ టోర్నీ నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించాడు. జాతీయ జట్టుకు ప్రాధాన్యం ఇవ్వాలనే ఉద్దేశంతోనే ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించాడు. పంతొమ్మిదో సీజన్‌లో ఢిల్లీకి తురుపుముక్కగా మారుతాడని భావించిన డకెట్ అకస్మాత్తుగా తప్పుకోవడంతో జట్టుకు ఎదురుదెబ్బ తగిలింది. 'ఐపీఎల్ నుంచి వైదొలగడం చాలా కష్టమైన నిర్ణయం. ఇంగ్లండ్ తరపున ఆడటం నా చిన్నప్పటి కల. వేసవిలో జరిగే సిరీస్‌లకు శారీరకంగా, మానసికంగా సిద్ధంగా ఉండాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నాను. ఢిల్లీ యాజమాన్యం, అభిమానులు నన్ను క్షమించాలి' అని ఆయన ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొన్నాడు. మినీ వేలంలో రూ.2 కోట్లకు డకెట్‌ను దక్కించుకున్న ఢిల్లీ అతడిపై భారీ ఆశలు పెట్టుకుంది. అయితే గత సీజన్‌లో హ్యారీ బ్రూక్ చేసినట్లే, ఈసారి సీజన్ ప్రారంభానికి ముందు డకెట్ తప్పుకోవడం జట్టుకు నిరాశ కలిగించింది. అక్షర్ పటేల్ సారథ్యంలో ఢిల్లీ తన తొలి మ్యాచ్‌కు సిద్ధమవుతోంది.

ఇదిలా ఉండగా, ఐదుసార్లు ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ కొత్త పేసర్‌ను జట్టులోకి తీసుకుంది. తొడ కండరాల గాయంతో నాథన్ ఎల్లిస్ టోర్నీకి దూరం కావడంతో అతడి స్థానంలో ఆస్ట్రేలియా స్పీడ్‌స్టర్ స్పెన్సర్ జాన్సన్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. వ్యక్తిగత కారణాలతో పాకిస్థాన్ సూపర్ లీగ్ నుంచి తప్పుకున్న జాన్సన్, ఇప్పుడు ఐపీఎల్‌లో రాణించాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. చెన్నై సూపర్ కింగ్స్ తమ తొలి మ్యాచ్‌లో మార్చి 30న రాజస్థాన్ రాయల్స్‌ను ఎదుర్కొనుంది.

## ఆర్సీబీ ఫ్రాంచైజీ చేతులు మారింది

**రూ.16,700 కోట్లకు ఆదిత్య బిర్లా--టైమ్స్ కన్సార్టియం కొనుగోలులిలి**

**బలగం టీవి, ముంబై**

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) ఫ్రాంచైజీ యాజమాన్యం మారింది. ఆదిత్య బిర్లా గ్రూప్, టైమ్స్ ఆఫ్ ఇండియా గ్రూప్ నేతృత్వంలోని కన్సార్టియం ఈ జట్టును 1.78 బిలియన్ డాలర్లకు (సుమారు రూ.16,725 కోట్లు) కొనుగోలు చేసినట్లు సమాచారం.

ఆదిత్య బిర్లా, టైమ్స్ గ్రూప్‌లతో పాటు బోల్ట్ వెంచర్స్, బ్లాక్‌స్టోన్ సంస్థలు కూడా ఈ కన్సార్టియంలో భాగస్వాములుగా ఉన్నట్లు తెలిసింది. ఆర్సీబీ ఫ్రాంచైజీలో 100 శాతం వాటాను సొంతం చేసుకునేందుకు యునైటెడ్ స్పిరిట్స్ లిమిటెడ్ (యూఎస్ఎల్)తో ఒప్పందం కుదిరినట్లు తెలుస్తోంది. ఈ డీల్‌లో ఐపీఎల్ పురుషుల జట్టుతో పాటు ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) మహిళల జట్టు కూడా ఉన్నాయి. కొత్త యాజమాన్యంలో ఆదిత్య బిర్లా గ్రూప్ డైరెక్టర్ ఆర్యమన్ విక్రమ్ బిర్లా చైర్మన్‌గా, టైమ్స్ గ్రూప్‌కు చెందిన సత్యన్ గజ్వానీ వైస్ చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. అయితే ఈ కొనుగోలుకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ), ఐపీఎల్, డబ్ల్యూపీఎల్ పాలక మండలుల నుంచి అధికారిక అనుమతులు రావాల్సి ఉంది. కొద్ది నెలల క్రితం ఆర్సీబీ మాతృసంస్థ డయాజియో పీఎల్సీ ఈ ఫ్రాంచైజీని అమ్మకానికి పెట్టింది. గతంలో వ్యాపారవేత్త విజయ్ మాల్యా ఈ జట్టును సొంతం చేసుకోగా, అనంతరం యునైటెడ్ స్పిరిట్స్ సంస్థను డయాజియో టేకోవర్ చేయడంతో ఆర్సీబీ యాజమాన్య హక్కులు బదిలీ అయ్యాయి. ఐపీఎల్ 2025, డబ్ల్యూపీఎల్ 2026 టైటిళ్లను వరుసగా గెలుచుకున్న ఏకైక ఫ్రాంచైజీగా ఆర్సీబీ ప్రత్యేక గుర్తింపు పొందింది.

**రాజస్థాన్ రాయల్స్ ఓనర్‌షిప్ మార్పు**

2026 ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ప్రారంభానికి ముందే కీలక పరిణామం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. లీగ్ ఫ్రాంచైజీల్లో ఒకటైన రాజస్థాన్ రాయల్స్ జట్టు యాజమాన్యం మారినట్లు జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి.

అమెరికాకు చెందిన వ్యాపారవేత్త కల్ సోమానీ నేతృత్వంలోని కన్సార్టియం ఈ ఫ్రాంచైజీని సుమారు 1.63 బిలియన్ డాలర్లకు (దాదాపు రూ.13,600 కోట్లు) కొనుగోలు చేసినట్లు సమాచారం. అయితే కొత్త యాజమాన్యం 2026 సీజన్ ముగిసిన తర్వాతే జట్టు బాధ్యతలు స్వీకరించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఈ ఒప్పందంపై ఇంకా అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఇదిలా ఉండగా, ఈ సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ తమ తొలి మ్యాచ్‌ను మార్చి 30న ఆడనుంది. గువాహటి వేదికగా చెన్నై సూపర్ కింగ్స్‌తో తొలి పోరుకు సిద్ధమవుతోంది. యువ కెప్టెన్ రియాన్ పరాగ్ నాయకత్వంలో ఈసారి జట్టు బరిలోకి దిగనుంది.



## చిన్నస్వామి తొక్కిసలాట బాధితులకు ఆర్‌సీబీ ప్రత్యేక నివాళి

**ప్రతి మ్యాచ్‌లో 11 సీట్లు రిజర్వ్ చేయాలని నిర్ణయం**

**బలగం టీవి, బెంగళూరు**

ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్ ప్రారంభానికి సమయం దగ్గరపడుతున్న వేళ క్ష్మశీఖుశ్రీ జష్ఠుశ్రీశ్రీవఅస్త్రవతీం దీవఅస్త్రుశ్రీబతీబ (ఆర్‌సీబీ) కీలక నిర్ణయం తీసుకుంది. గత ఏడాది వీ. Chinnaswamy Stadiumలో జరిగిన తొక్కిసలాట ఘటనలో మరణించిన 11 మంది అభిమానుల జ్ఞాపకార్థం ప్రతి మ్యాచ్‌లో 11 సీట్లను రిజర్వ్ చేయాలని ఫ్రాంచైజీ యాజమాన్యం, ఖుతీఅఖుఖు క్ఫ్‌వ జతీఅఎవె ాంశీఎఖశీఖ నిర్ణయించాయి. గతంలోనే బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల ఆర్థిక సాయం ప్రకటించిన ఆర్‌సీబీ, ఇప్పుడు స్టేడియంలో ప్రత్యేక గౌరవం కల్పించనుంది. ఈ నిర్ణయాన్ని బెంగళూరు యాజమాన్యం అధికారికంగా ధృవీకరించింది.

ఐపీఎల్ 18వ సీజన్‌లో విజేతగా నిలిచిన తర్వాత ఆర్‌సీబీ విజయోత్సవ యాత్రకు పిలుపునిచ్చింది. విధానసౌధ నుంచి చిన్నస్వామి స్టేడియం వరకు నిర్వహించిన విక్టరీ పరేడ్‌కు భారీగా అభిమానులు తరలివచ్చారు. 35 వేల సామర్థ్యం ఉన్న స్టేడియానికి సుమారు 2.5 లక్షల మంది చేరుకోవడంతో పరిస్థితి అదుపు తప్పి తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో 11 మంది అభిమానులు ప్రాణాలు కోల్పోయారు. ఈ దుర్ఘటనపై రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమయ్యాయి. భద్రతా ఏర్పాట్లు తగిన విధంగా చేయలేదనే విమర్శలు వ్యక్తమయ్యాయి. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించగా, ఆర్‌సీబీ, కర్నాటక క్రికెట్ సంఘం మరియు ఈవెంట్ నిర్వహణ సంస్థపై కేసులు నమోదయ్యాయి.

## ప్రపంచ కాలుష్య దేశాల్లో పాకిస్థాన్ అగ్రస్థానం

- ఐక్యూఎయిర్ నివేదికలో భారత్ ఆరో స్థానంలో..

**బలగం టీవి, హైదరాబాద్**

ప్రపంచంలో అత్యంత కాలుష్యంతో బాధపడుతున్న దేశాల జాబితాలో పాకిస్థాన్ తొలి స్థానంలో నిలిచినట్లు తాజా నివేదిక వెల్లడించింది. బంగ్లాదేశ్, తజికిస్తాన్ వరుసగా రెండో, మూడో స్థానాల్లో ఉండగా భారత్ ఆరో స్థానంలో నిలిచింది. స్విట్జర్లాండ్‌కు చెందిన గాలి నాణ్యత సాంకేతిక సంస్థ 'ఐక్యూఎయిర్' విడుదల చేసిన 2025 వరల్డ్ ఎయిర్ క్వాలిటీ రిపోర్ట్‌లో ఈ వివరాలు వెల్లడయ్యాయి. మొత్తం 143 దేశాలు, ప్రాంతాలు, భూభాగాల్లోని 9,446 నగరాల నుంచి సేకరించిన డేటాను విశ్లేషించి ఈ నివేదికను రూపొందించారు. ప్రపంచవ్యాప్తంగా 40,000కుపైగా మానిటరింగ్ స్టేషన్లు, తక్కువ ఖర్చు సెన్సర్ల నుంచి సేకరించిన సమాచారాన్ని ఇందుకు ఉపయోగించారు. ఈ ప్రక్రియలో ప్రభుత్వ సంస్థలు, విశ్వవిద్యాలయాలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రైవేట్ సంస్థలు, పౌర శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

కాలుష్య దేశాల జాబితాలో చైనా 20వ స్థానంలో ఉండగా, అమెరికా 120వ స్థానంలో, యునైటెడ్ కింగ్‌డమ్ 110వ స్థానంలో ఉన్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) నిర్దేశించిన వార్షిక సగటు పీఎం2.5 ప్రమాణాలను కేవలం 13 దేశాలు లేదా ప్రాంతాలు మాత్రమే పాటించగలిగినట్లు నివేదిక పేర్కొంది. ఫ్రెంచ్ పోలినీషియా, ప్యూర్టో రికో, యూఎస్ వర్జిన్ దీవులు, బార్బడోస్, న్యూ కాలెడోనియా, ఐస్లాండ్, బెర్ముడా, రీయూనియన్, అండోరా, ఆస్ట్రేలియా, గ్రెనడా, పానామా, ఎస్టోనియా ఈ జాబితాలో ఉన్నాయి. మొత్తం 143 దేశాల్లో 130 దేశాలు (91 శాతం) డబ్ల్యూహెచ్‌ఓ నిర్దేశించిన పీఎం2.5 పరిమితులను మించాయని నివేదిక స్పష్టం చేసింది. అత్యంత కాలుష్య దేశాలుగా పాకిస్థాన్, బంగ్లాదేశ్, తజికిస్తాన్, చాద్, డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలు ఉన్నాయి. ప్రపంచంలో అత్యంత కాలుష్యంతో ఉన్న 25 నగరాలు భారత్, పాకిస్థాన్, చైనా దేశాల్లోనే ఎక్కువగా ఉన్నట్లు నివేదిక తెలిపింది. వీటిలో అధిక సంఖ్యలో నగరాలు భారత్‌లోనే ఉండటం గమనార్హం. నగరాల వారీగా ఉత్తరప్రదేశ్‌లోని లోనీ అత్యంత కాలుష్య నగరంగా నిలవగా, చైనాలోని హోటాన్, మేఘాలయ రాష్ట్రంలోని బైర్నిహాట్ తరువాతి స్థానాల్లో ఉన్నాయి. ఢిల్లీ నాలుగో స్థానంలో, పాకిస్థాన్‌లోని ఫైసలాబాద్ ఐదో స్థానంలో ఉన్నాయి.

అత్యంత పరిశుభ్రమైన నగరంగా దక్షిణాఫ్రికాలోని న్యూవౌడ్‌విల్ నిలిచింది. 2025లో అటవీ అగ్నిప్రమాదాలు గాలి నాణ్యతపై తీవ్ర ప్రభావం చూపినట్లు నివేదిక పేర్కొంది. గతంలో తక్కువ కాలుష్య స్థాయిలు ఉన్న ప్రాంతాల్లో కూడా పీఎం2.5 స్థాయిలు పెరిగాయి. ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా కేవలం 14 శాతం నగరాలు మాత్రమే డబ్ల్యూహెచ్‌ఓ ప్రమాణాలను అందుకోగలిగాయి. 2024లో ఇది 17 శాతంగా ఉండటం గమనార్హం.

# ఐపీఎల్‌లో కొత్త రూల్స్... మ్యాచ్ డే ప్రాక్టీస్‌కు నో




**బలగం టీవి, హైదరాబాద్**

ఇండియన్ ప్రీమియర్ లీగ్ మేనియా మరో 3 రోజుల్లో ప్రారంభం కానున్న నేపథ్యంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఈ సీజన్‌కు ముందుగా పలు కీలక నిబంధనలు ప్రవేశపెట్టింది. జట్ల మధ్య సమానత్వం, మైదానాల నాణ్యత, ఆటగాళ్ల భద్రత వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని ఈ మార్గదర్శకాలు జారీ చేసినట్లు తెలుస్తోంది.

**మ్యాచ్ రోజు ప్రాక్టీస్‌కు నిషేధం**

కొత్త నిబంధనల ప్రకారం మ్యాచ్ జరుగుతున్న రోజున ఇరు జట్లకు ప్రాక్టీస్ సెషన్‌లకు పూర్తిగా నిషేధం విధించారు. ఇంతకు ముందు మ్యాచ్ రోజు కూడా ఆటగాళ్ల సాధన చేయడానికి అనుమతి ఉండేది. పిచ్ నాణ్యత దెబ్బతినకుండా ఉండేందుకు, జట్లకు ఎటువంటి వ్యూహాత్మక ప్రయోజనం కలగకుండా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నారు.

**ప్రత్యర్థి పిచ్ వినియోగానికి నో**

ప్రాక్టీస్ కోసం మైదానంలో ఇరు జట్లకు చెరో పిచ్ కేటాయిస్తారు. ఒక జట్టు తన ప్రాక్టీస్ ముందుగానే పూర్తి చేసినా, ఆ పిచ్‌ను ప్రత్యర్థి జట్టు ఉపయోగించరాదు. అలాగే మ్యాచ్ జరిగే మెయిన్ పిచ్‌ను హోం జట్టు కూడా వాడుకోలేరు. రేంజ్ హిట్టింగ్ కోసం రెండు నెట్ పిచ్‌లు, ఒక సైడ్ వికెట్ మాత్రమే అందుబాటులో ఉంటాయి. ఈసారి ఓపెన్ నెట్లకు కూడా అనుమతి ఇవ్వడం లేదు.

**మ్యాచ్ రోజున ఫిట్‌నెస్ టెస్ట్‌లకు గ్రీన్ సిగ్నల్ లేదు**

మెయిన్ స్క్వాడ్‌లో ఉన్న ఆటగాళ్లకు మ్యాచ్ జరిగే రోజు మైదానంలో ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించడాన్ని బీసీసీఐ నిషేధించింది. దీంతో తుది జట్టు కూర్పుపై చివరి నిమిషంలో ఏర్పడే గందరగోళానికి చెక్ పడనుంది.

**డ్రెస్సింగ్ రూమ్ ప్రవేశానికి కఠిన నియంత్రణలు**

టోర్నమెంట్‌కు ముందు లేదా టోర్నీ జరుగుతున్న సమయంలో ప్రాక్టీస్ సెషన్‌లకు గుర్తింపు పొందిన సిబ్బందికే డ్రెస్సింగ్ రూమ్, మైదానంలోకి అనుమతి ఉంటుంది. అదనపు సహాయక సిబ్బంది అవసరమైతే ముందుగా బీసీసీఐ అనుమతి తీసుకుని ఐడీ కార్డులు పొందాల్సి ఉంటుంది.

**ఇతర ముఖ్య నిబంధనలు**

ప్రాక్టీస్ కోసం ఆటగాళ్లు హోటల్ నుంచి మైదానానికి తప్పనిసరిగా టీమ్ బస్సుల్లోనే రావాలి. కుటుంబ సభ్యులు వేరే వాహనాల్లో రావాల్సి ఉంటుంది.

మ్యాచ్ రోజు ప్రాక్టీస్ లేదా ఫిట్‌నెస్ టెస్ట్‌లకు సంబంధించిన ఫిర్యాదులు ఉంటే ముందుగా స్టేడియం నిర్వాహకులను సంప్రదించాలి.

ఆటగాళ్లు, సహాయక సిబ్బంది ఎల్ఈడీ బోర్డుల ముందు కూర్చోరాదు. మ్యాచ్‌లో పాల్గొంటున్న ఆటగాళ్లకు అవసరమైన సామగ్రి అందించే సిబ్బందికి మాత్రమే అక్కడ అనుమతి ఉంటుంది.

ఆరెంజ్, పర్పుల్ క్యాప్ హోల్డర్లు మ్యాచ్ ప్రారంభంలో కనీసం రెండు ఓవర్లు ఆ క్యాప్‌లను ధరించాలి.

మ్యాచ్ అనంతరం ప్రజెంటేషన్‌కు స్లీవ్‌లెస్ జెర్సీలు, ఫ్లిప్‌ఫ్లాప్ చెప్పులతో హాజరుకావడాన్ని నిషేధించారు. నిబంధన ఉల్లంఘిస్తే జరిమానా విధిస్తారు.

మ్యాచ్ సమయంలో జట్టు వైద్యుడితో సహా కేవలం 12 మంది గుర్తింపు పొందిన సహాయక సిబ్బందికే అనుమతి ఉంటుంది.

ఆటగాడు జెర్సీ నంబర్ మార్చుకోవాలంటే మ్యాచ్‌కు కనీసం 24 గంటల ముందే సమాచారం ఇవ్వాలి.

ఈ కొత్త మార్గదర్శకాలతో ఐపీఎల్ మరింత క్రమబద్ధంగా, సమాన అవకాశాలతో కొనసాగుతుందని బీసీసీఐ భావిస్తోంది.

## భూగర్భ జలాల పరిరక్షణపై అవగాహన కార్యక్రమం

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**



తంగళ్ళపల్లి మండలం, బద్దెనపల్లి గ్రామంలోని రైతు వేదికలో ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బస్టాండ్ నుండి రైతు వేదిక వరకు ర్యాలీ నిర్వహించి ప్రజల్లో నీటి పరిరక్షణపై అవగాహన కల్పించారు. భూగర్భ భూగర్భ జలాధికారి జి. నాగరాజు, ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేశారు. భూగర్భ జలాల ప్రాధాన్యత మరియు వాటిని రక్షించడానికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రజల కి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ హైడ్రోజియోలాజిస్ట్ ఇ. రవీందర్, అసిస్టెంట్ హైడ్రాలజిస్ట్ ఎం. ప్రవీణ్ కుమార్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తమిళనాడు ఎన్నికలకు కమల్ పార్టీ దూరం

- డీఎంకే కూటమికి 'మక్కల్ నీది మయ్యం' మద్దతు

**బలగం టీవి, హైదరాబాద్**



రాబోయే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో సినీనటుడు కమల్ హాసన్ స్థాపించిన 'మక్కల్ నీది మయ్యం' (ఎంఎన్ఎం) పార్టీ పోటీ చేయబోదని ప్రకటించింది. అయితే అధికారంలో ఉన్న ద్రవిడ మున్నేట్ర కజగం (డీఎంకే) నేతృత్వంలోని కూటమికి పూర్తి మద్దతు ఇస్తామని కమల్ వెల్లడించారు.

మంగళవారం తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్‌తో సమావేశమైన అనంతరం కమల్ మీడియా తో మాట్లాడారు. "మేము డీఎంకే కూటమికి సంపూర్ణ మద్దతు ఇస్తాం. మా విజయం ఖాయం. నా దార్శనికత గురించి పార్టీ కార్యకర్తలకు బాగా తెలుసు. మేము మధ్యేవాదులం. ఏ వైపుకూ మొగ్గు చూపకుండా ప్రజల ప్రయోజనాలకే కట్టుబడి ఉంటాం" అని తెలిపారు. ప్రస్తుతం రాజ్యసభ సభ్యుడిగా కొనసాగుతున్న కమల్ హాసన్, డీఎంకే కూటమి మద్దతుతో జూన్ 12న ఏకగ్రీవంగా రాజ్యసభకు ఎన్నికయ్యారు. అవినీతి నిర్మూలన, గ్రామీణాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై దృష్టి సారిస్తూ ఆయన 2017లో ఎంఎన్ ఎం పార్టీని స్థాపించారు.

2019 లోక్‌సభ ఎన్నికల్లో ఎంఎన్ఎం సుమారు నాలుగు శాతం ఓట్లను సాధించి తమిళనాడు రాజకీ యాల్లో తన స్థానం ఏర్పరుచుకుంది. అనంతరం 2021 అసెంబ్లీ ఎన్నికల్లో కమల్ హాసన్ కోయంబత్తూరు దక్షిణం నియోజకవర్గం నుంచి పోటీ చేసి బీజేపీ అభ్యర్థి వనతి శ్రీనివాసన్ చేతిలో స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యారు.

ఇక 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో కూడా ఎంఎన్ఎం పోటీ చేయకుండా డీఎంకే కూటమికి మద్దతు ప్రకటించింది. ఇదిలా ఉండగా, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు ఏప్రిల్ 23న ఒకే దశలో జరగనున్నాయి. ఓట్ల లెక్కింపు మే 4న నిర్వహించనున్నారు.

## అరుణాచల్ సరిహద్దులో 'బోర్డర్ బ్రూ కేఫ్' ప్రారంభం

**బలగం టీవి, హైదరాబాద్**

అరుణాచల్ ప్రదేశ్‌లోని మారుమూల సరిహద్దు ప్రాంతంలో భారత సైన్యం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 'ఆపరేషన్ సద్భావన'లో భాగంగా తవాంగ్ జిల్లా జెమితాంగ్ గ్రామంలో 'బోర్డర్ బ్రూ కేఫ్' పేరుతో కాఫీ షాప్‌ను ప్రారంభించింది. స్థానిక గిరిజన సమాజ అభివృద్ధి, పర్యాటక ప్రోత్సాహమే ఈ ప్రాజెక్టు లక్ష్యమని రక్షణ శాఖ అధికారులు తెలిపారు. ఈ కేఫ్ ద్వారా స్థానిక మోన్పా గిరిజన తెగ ప్రజలకు సాధికారత కల్పించడం, స్థిరమైన జీవనోపాధి అవకాశాలు కల్పించడం ప్రధాన ఉద్దేశంగా సైన్యం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది.

జెమితాంగ్ లోయ గుండా ప్రవహించే న్యామ్జంగ్ చు నదిపై వాడకంలో లేని పాత బ్రైలీ వంతెనపై ఈ కేఫ్‌ను నిర్మించడం విశేషంగా నిలిచింది. ఒక వారసత్వ కట్టడాన్ని ఆధునిక అవసరాలకు అనుగుణంగా మార్చి వినియోగించడం ఈశాన్య రాష్ట్రాల్లో ఇదే తొలిసారి అని రక్షణ శాఖ ప్రతినిధి లెఫ్టినెంట్ కల్నల్ మహేంద్ర రావత్ తెలిపారు. ఈ కేఫ్ సరిహద్దు ప్రాంతాన్ని సందర్శించే పర్యాటకులకు ఒక ఐకానిక్ గమ్యస్థానంగా మారుతుందని, స్థానిక సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి పరిచయం చేసే వేదికగా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

భారత సైన్యం కేవలం 31 రోజుల రికార్డు సమయంలో ఈ ప్రాజెక్టును పూర్తి చేయడం గమనార్హం. ఇది సైన్యం ప్రణాళికా నైపుణ్యం, సమన్వయం, కార్యనిర్వహణ సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తుంది.

'ఆపరేషన్ సద్భావన' ద్వారా సరిహద్దు ప్రాంతాల సామాజిక-ఆర్థిక అభివృద్ధికి సైన్యం నిరంతరం కృషి చేస్తోంది. ముఖ్యంగా జమ్మూ ఛ కశ్మీర్, లద్దాఖ్ ప్రాంతాల్లో విద్య, ఆరోగ్యం, మౌలిక సదుపాయాలు, మహిళలు మరియు యువతకు వృత్తి శిక్షణ వంటి కార్యక్రమాలను చేపడుతూ పౌర-సైనిక సంబంధాలను బలోపేతం చేస్తోంది.ఈ కేఫ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి స్థానిక ప్రజలు, ప్రముఖులు, సైనిక సిబ్బంది ఉత్సాహంగా హాజరయ్యారు. ఇది జెమితాంగ్ ప్రాంతానికి ఒక గర్వకారణమైన మైలురాయిగా నిలుస్తుందని లెఫ్టినెంట్ కల్నల్ రావత్ తెలిపారు.

